**హాస్యం హాస్యం**

# ఆకుకూరలు

**మహర్షి**

## పాలకూర, తోటకూర, తుంటికూర, పుంటికూర, పొన్నగంటి కూర, ఆ కూర, ఈ కూర, కొత్తిమీర, కరివేపాకు, ఆ ఆకు, ఈ ఆకు కావాలంటేయ్!''

## ఆకు కూరలమ్మి ఇంటి ముందు ఆగి అరుస్తున్నది.

అంతలో వంటిట్లో టిఫిన్ లాగిస్తున్న రాగమ్మ బయ్ మని అరిచింది. హాల్లో తీరిగ్గా కూర్చుని హత్యల గురించి, బాంబుల వర్షం గురించి వార్తలు చదువుకుంటున్న భర్త గంగయ్య లోపల శబ్దానికి ఉలిక్కిపడి ధభీమని క్రిందపడి 'ధూ, ధూ' అని వీపు బాదుకుని లేచి కూర్చుని "ఎందుకలా అరిచావ్. నేనివతల జడుసుకుని చచ్చాను" అనేసి మళ్ళీ పేపర్లో తల దూర్చాడు.

"బయట కూరలదొచ్చింది. కాస్త బిస్తువు" అన్నది రాగమ్మ.

"మాటలలా వస్తున్నాయి ఏం వేస్తున్నావే" పేపర్లో నుండే అరిచాడు గంగయ్య.

"టిప్పన్ టింటున్నా" అన్నది రాగమ్మ రాగయుక్తంగా.

"టిఫిన్ గొంతుక్కడ్డం పడుతుంది కాసిని మంచినీళ్ళు తాగి చావ్. అయినా మొగుణ్ణినే వాడిని ఒకడిని ఉన్నానని కూడా లేకుండా తీరిగ్గా వంటింట్లో కూర్చుని అలా మెక్కడం ఏం బాగాలేదు. వండినదంతా ఒక్కదానివే మింగకపోతే నాక్కూడ కాస్త తగలెయ్యవచ్చుకదా!" విసుక్కున్నాడు గంగయ్య.

రాగమ్మ గబుక్కున గ్లాసెడు నీళ్ళందుకుని గుటుక్కున మింగి "నీకెప్పుడు తిండి గొడవ తప్ప ధ్యాసలేదు. నీకు వంటలు వేసి పెట్టలేక చస్తున్నానని నోరు పడిపోను. నీది కడుపు కాదు హుస్సేన్ సాగర్" అన్నది రాగమ్మ గబగబా బయటకొచ్చి మెటికలు విరుస్తూ.

"ఒసేయ్! మరీ అలా నువ్వు నువ్వు అని పిలవకే నలుగురు వింటే బాగుండదు. అయినా మనం సిటీలో వుంటున్నాం. మొగుణ్ణి కాస్త మర్యాదగా పిలవడం నేర్చుకోవే" మందలించాడు గంగయ్య.

"నువ్వైతే మాత్రం ఒసేయ్! ఏమోవ్ అనవచ్చు" సిటికొచ్చినా అమెరికా వెళ్ళినా పుటకలతో వచ్చింది పిడకలతో పోవాల్సిందే మరి. నేను నువ్వే అంటాను" మొండిగా అన్నది రాగమ్మ.

"ఖర్మ ఖర్మ" అని ఆ పిడకల యోగం ఎప్పుడు కలుగుతుందో కదా అనుకుని తల బాదుకున్నాడు గంగయ్య.

"అవును ఎందుకలా అరిచావు" గుర్తొచ్చి తనే అడిగాడు.

"అవునవును ఎందుకు పిలిచాను. మీతో మాట్లాడి మాట్లాడి మీలాగా నాక్కూడా బుర్రలో గుజ్జు తగ్గిపోతున్నది" అంటూ భర్త తల బరబరమని గోకింది రాగమ్మ.

"ఇదేం విడ్డూరమే. ఏదైనా గుర్తుకు రాకపోతే ఎవరి తలవాళ్ళు గోక్కుంటారు కానీ ఎదుటి వాళ్ళ తలగోకడం నేనెక్కడా చూడలేదు" విసుక్కున్నాడు గంగయ్య.

"అమ్మా! నా తల గోక్కుంటే నా జుట్టు ఊడిపోతుంది. ఊడిపోతే పోతుంది మీ జుట్టు కదా అని గోకుతున్నాను. ఇది మా అమ్మ దగ్గర నేర్చుకున్నాను. ఆ గుర్తుకొచ్చింది. బయట ఆకు కూరలది వచ్చింది కాస్త పిలువు" అంటూ విసవిస వంటింట్లోనికి నడిచింది రాగమ్మ.

గంగయ్య పేపరు పక్కన పడేసి బయటకొచ్చి కూరలమ్మిని ఓ పొలికేక వేసి లోపలకొచ్చి మళ్ళీ పేపరులో తలదూర్చాడు.

"ఈ కొంపలో ఇంతమంది వున్నారు ఎవరు పిల్చినను" అని అరిచింది కూరలమ్మి.

మూడు నిమిషాల తరువాత మెల్లగా గడపలో కొచ్చి "ఏం కూరులున్నాయి"' అడిగింది రాగమ్మ.

"చూడనీకి కల్లు లేవా, నడవనీకి కాల్లు లేవా? జర వచ్చి చూసి పోరాదూ!" కూరలమ్మి దీర్ఘం తీసింది. రాగమ్మ బుట్టతీసుకొని రావడానికి లోపల కెళ్ళింది. కూరలమ్మి బొడ్డులో నుండి పంచి బయటకు లాగి ఓ ఆకుతీసి సున్నంరాసి వక్క ముక్కలు వేసుకుని నోట్లో పెట్టుకుని పుటుక్కున కొరికింది.

"ఎవడా నంగిగాడు పిలిచి అట్లనే లోనకో యిందు" అన్నది రాగమ్మరావడంతో.

"మా ఆయనేలే. అవును పది రకాల కూరలున్నాయని పిలిచావు కదా! నాలుగు రకాలే వున్నాయేమిటి?" పుల్ల విరుపుగా అన్నది రాగమ్మ.

"నీ మొకము. గట్ల పిల్వకపోతే ఏ ఎర్రిబాగుల్ది పిలుస్తాది మరి. కావాల్సింది లేకపోయినా తట్ట దింపినందుకు నేను తిడతానేమోనని ఏదో ఒకటి తీస్కుంటారు. ఔ ఏం కావాలి. పుంటి కూర తీస్కో. నీ మగనికి మంచి పట్టు వస్తది" అన్నది కూరలమ్మి తుపుక్కున ఉమ్మి.

"ఎట్లా వండినా తింటారు మా టింగరోడు. అయినా అది నాకు నచ్చదు. వేరే కూరలుంటే ఇవ్వు" అన్నది రాగమ్మ.


"నీకసలు మొగుడంటే గింతకూడా ఇలువ లేనట్లున్నదే. నేను నానా దిపాల్సింది మా ఇంటోడిని గిట్లనే రాసి గీసి కష్టాలు పెట్టిన. నా కష్టములనోర్చు

కోలేక ఓ దివాం చెప్ప చెయ్యిక అటు నుండి అటే పోయిందు. గప్పుడు పంది నాకు గుబులయింది. ఏం వేయాలి? చప్పుడు వేయిక నోరు మూస్కుని బత్కుతుంటి. గట్లా మొగున్ని గుబులు వేయకు మల్లా. అన్నది కూరలమ్మి రాగమ్మ మీద జాలి చూపిస్తూ తుపుక్కున ఉమ్ముతూ.

రాగమ్మకు కోపం ముంచుకొచ్చింది. బి.పి. పెరిగి రాగం అందుకుంది.

"ఓరి నాయినోయ్ ! ఓరి దేవుడోయ్ ! ఈయని కట్టుకుని అడ్డమైన ఆకు కూరలు అమ్ముకునే దానికి కూడా లోకువయ్యాను. నా స్థాయి దిగజారిపోతున్న దిరో భగవంతుడా! అన్నది కళ్ళు వత్తుకుంటూ.

"ధూ నీయవ్వ. ఎందుకలా పొద్దుగాల పొద్దుగాల గంప ముందు కూకుని ఏడుస్తవు. అలా ఏడిస్తే




మొగుడు చచ్చినట్లయితది. గట్ల ఏడ్వకూడదు. అయినా నేనేం చెప్పినా? అంత గుస్సా అయితవు. అదికాదు బిడ్డా నేను చెప్పేది దేమిటంటే భరతను గౌరవించమని చెప్పినా".

"అది నాకు తెలుసులే. ఈ పాల కూరెలా యిస్తావు" అన్నది రాగమ్మ విసురుగా.

"ధూ. అని ఊసి "ఎట్లాగిస్తానేంటి? తట్టలో కెల్ల చేత్తో యిస్తా. గామాత్రం ఎరికలేని ఎర్రి బాగుల దానిలాగున్నావ్" అన్నదామె.

"కాలుతో ఇస్తావనుకున్నాను. ఊ నేననేది రూపాయికి ఎన్ని కట్టలిస్తావని" అన్నది హేళనగా.

"తియ్ . రూపాయికెన్నంటావ్. దో రూపాయికి తీన్ — ధూ" అన్నదామె.

"ఏమిటి రెండు రూపాయలకు మూడా? మా ఊరిలో వీటిని బర్రెలు కూడా తినవు మరి" అన్నది రాగమ్మ వెర్రి గంతులేస్తూ.

# ●●● ఎందుకలా పొద్దుగాల పొద్దుగాల గంప ముందు కూకుని ఏడుస్తవు. ●●●

"ఇదిగో నీ వూరిలో బర్రెలు తినకపోతే పోనీయ్ . జరంత నీ మొగన్ని పిలుస్తావు ఫో" అన్నది కూరలమ్మి.

"ఎందుకట?" సాగదీసింది రాగమ్మ.

ఇదంతా ఎదురుగా వుండే వెంకాయమ్మ గమనిస్తూనే వుంది.

"గపంత గడ్డి పెడతాను" అన్నది కూరలమ్మి.

"ఎందుకు?"

"నిన్ను కట్టుకున్నందుకు కపంత గడ్డి పెడితే బుద్ధివస్తాదేమోనని— ధూ, ధూ" అన్నది కూరలమ్మి విసుగ్గా.

"ఏంటే మాట మాటకు ఉమ్మి ఊస్తున్నావ్. కూరలు వద్దు. నీ గడ్డి పరకలు వద్దు. వెళ్ళు వెళ్ళు" విసుక్కున్నది రాగమ్మ.

"ఎల్లెల్లి నమ్మ పెద్ద కొనడానికి వచ్చింది. అయినా కొననీకి దమ్ములుండాలి. ఆ?" అంటూ విసుక్కుంటూ గంప ఒక్క విసురుగా ఎత్తుకుని రాగమ్మకు అర్థం కాని భాషలో తిట్టుకుంటూ వెళ్ళిపోయింది. వెంకాయమ్మకు అలా తిడుతున్నందుకు చాలా ఆనందంగా వుంది. గతవారం ఓ గ్లాసుడు పాలు బదులిమ్మని అడిగితే లేవని తెగేసి చెప్పింది అనుకున్నది.

"దీని నోట్లో కంపకొట్టు. ఈ దొంగ ముండని మొగుడు వదిలిపెట్టా. అవును దీని మొగుడు వదిలేశాడట కదా! దీని ఆకు కూరలన్నీ ఎండిపోను" తిట్టుకుంటూ రాగమ్మ ఇంట్లోనికి అడుగు పెట్టింది.

"ఏమిటా తిట్టులు మరీ అసహ్యంగా తెలుగు సినిమాలోలా వున్నాయి. ఎవర్ని అలా తిడుతున్నావు వింటే భరించలేక ఆత్మహత్య వేసుకుంటారు" అంటూ పేపరులో నుండి తల బయట పెట్టి భార్యను చూసి కెవ్వున అరచి "ఒళ్ళంతా ఆ రక్తం ఏమిటి? ఎవడో కత్తితో పొడిసినట్లున్నాడు. అయినా సిటీలో కత్తిపోటు సంఘటనలు లేవు కదా! పేపర్లో రాయలేదు. అంబులెన్స్. అంబులెన్స్" అంటూ నిప్పు తొక్కిన కోతిలా గంతులేస్తున్నాడు గంగయ్య.

అర్థం కాని రాగమ్మ "ఛీ ఛీ మీ పేపరు పాడుకాను భయంకరమైన వార్తలు చదివి చదివి మతిభ్రమించి నట్లున్నది" అన్నది రాగమ్మ విసుగ్గా.

"అది కాదే. నీ ఒళ్ళంతా రక్తమే" అన్నాడు కంగారుగా.

రాగమ్మ అప్పుడు చూసుకుంది. రక్తాన్ని చూసి కెవ్వున అరచి స్పృహ తప్పి దభీమని పడిపోయింది.

గంగయ్య బావురు బావురుమని గోల గోల చేస్తున్నాడు.

అంతలో వెంకాయమ్మ రంగప్రవేశం చేసి "గంగయ్య! అలా వెర్రి గంతులు వేయకు. మీ ఆవిడ ఒంటి నిండా వున్నది రక్తం కాదు. కూరలమ్మి పాన్ నమిలి ఊసింది. అది కాస్త ఆవిడ మీద పడిందంతే" అన్నది.

"ఎంత చల్లని వార్త చెప్పారు పిన్నిగారూ! మొన్న మీరడిగిన పాలు ఇప్పుడిస్తాను తీసుకెళ్ళండి" అంటూ లేచి కూర్చుంది రాగమ్మ.

"నువ్వు పోలేదా? పోయావనుకుని ఆనందంతో ఏడుస్తున్నాను" అని నోరు జారిన గంగయ్య చటుక్కున నాలుక కరుచుకున్నాడు.

●